క్లుప్తంగా

జలజీవన్ మిషన్‌పై శిక్షణ



శిక్షణ నిర్వహిస్తున్న డీఆర్‌డీఏ సిబ్బంది

ఓడీచెరువు : మహిళా సంఘం సభ్యులకు మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో జలజీవన్ మిషన్‌పై శిక్షణ నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దీపిక, డీఆర్‌డీఏ ఏపీఎం రమణప్ప ఆధ్వర్యంలో జలజీవన్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్ ధనుంజయ శిక్షణ ఇచ్చారు. మండలానికి 30 కాంట్రాక్టు పనులు మంజూరయ్యాయన్నారు. ఈ కాంట్రాక్టులను మహిళా సంఘాల భాగస్వామ్యంతో జలసంఘాలకు అప్పగిస్తారన్నారు. వీటి నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, డీఆర్‌డీఏ సిబ్బంది, జలసంఘాల కమిటీ సభ్యులు, వీఏఏలు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



విజేతలకు నగదు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: మున్సిపల్ పరిధిలోని వీవర్స్ కాలనీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం రిజర్వ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రమణకుమార్, ఎంఈఓలు చెన్నకృష్ణ, ప్రధానోపాధ్యాయులు నాగరాజు, కెనరాబ్యాంక్ మేనేజర్ మధుసూదన్ మాట్లాడారు. విద్యార్థిదశనుంచే ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులకు బ్యాంకింగ్ అవసరాలు, డిజిటల్, పరిశుభ్రతపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్థిక అక్షరాస్యత సలహాదారులు వీరమారుతి, నాగప్పతో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహకాలు



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి

ముదిగుబ్బ: పండ్లతోటల పెంపకానికి ప్రభుత్వం పలు ప్రోత్సాహకాలందిస్తోందని ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి తెలిపారు. ముదిగుబ్బ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ కింద చేపట్టిన ఫారంపాండ్ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. కూలీల మస్టరు తనిఖీ చేసి పని వద్ద సౌకర్యాలపై ఉపాధి సిబ్బందితో ఆరా తీశారు. ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు సాగు చేసుకుంటున్న పండ్ల తోటలను ఎంపీడీఓ పరిశీలించారు. పండ్లతోటల పెంపకానికి ప్రభుత్వమందించే ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు



సూచనలిస్తున్న టీబీ కంట్రోల్ ఆఫీసర్ తిప్పయ్య

తలుపుల: మండలంలోని ఈదులకుంట్లపల్లి, గుండువారిపల్లి గ్రామాల్లో వైద్యాధికారి అశ్రిత ఆధ్వర్యంలో మంగళవారం సిబ్బంది క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ తిప్పయ్య, పీపీఎం నాగమణి, టీబీ సూపర్వైజర్ శ్రీనివాసులు పర్యవేక్షించారు.

నేడు కేజీబీవీ కళాశాల భవనం ప్రారంభం

తలుపుల: మండల కేంద్రంలోని కేజీబీవీ ఆవరణలో రూ.1.02 కోట్లతో నిర్మించిన ఇంటర్ కళాశాల భవనం బుధవారం ఉదయం పది గంటలకు ప్రారంభించనున్నారు. ఎమ్మెల్యే సిద్దారెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కన్వీనర్ ఫయాజ్ అహమ్మద్, సీనియర్ నాయకులు పురుషోత్తం రెడ్డి కోరారు.

శ్రీశైలానికి శివమాలధారుల పాదయాత్ర



ధర్మవరం రూరల్: పట్టణంలోని పలువురు శివమాలదారులు మంగళవారం శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్లారు. వీరంతా తొలుత స్థానిక శివానగర్‌లోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఇరుముడులు ధరించి బయల్దేరారు. పాదయాత్రగా వెళ్లిన వారిలో గురుస్వామి నరసింహారెడ్డి, శివరాం, శివారెడ్డి, నాగరాజు, నాగేంద్ర, లోకేష్, బాలచంద్ర, వీరసింహ ఉన్నారు.

పెద్దకోట్ల.. ప్రగతికి బాట

పెద్దకోట్ల పంచాయతీని గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. మౌలిక సదుపాయాలు లేక ప్రజలు నరకయాతన అనుభవించారు. సమస్యలపై ఎందరికి విన్నవించుకున్నా స్పందన కరువైంది. వైఎస్సార్‌సీపీ సర్కారులో ఈ పంచాయతీకి మహర్దశ కలిగింది. దశలవారీగా సౌకర్యాలు మెరుగుపడటంతో ప్రజలు ఇబ్బందుల నుంచి ఉపశమనం పొందారు.

- తీరిన అపరిష్కృత సమస్యలు
- తారు రోడ్డుతో సాఫీగా రాకపోకలు
- వీధుల్లోనూ సీసీ రోడ్లు, డ్రెయినేజీలు
- 'నాడు–నేడు'తో మారిన బడుల రూపురేఖలు
- సచివాలయ వ్యవస్థతో ముంగిటకే ప్రభుత్వ సేవలు



పెద్దకోట్లలో నిర్మించిన సచివాలయం



గుడ్డంపల్లిలో వేసిన సిమెంట్ రోడ్డు

తాడిమర్రి: జగన్ సర్కారు సచివాలయ– వలంటీర్ వ్యవస్థ ప్రవేశపెట్టిన తర్వాత ప్రభుత్వ సేవలన్నీ ప్రజల ముంగిటకే చేరాయి. ఏ పని అయినా.. సమస్య అయినా నిర్దిష్ట గడువులోపు పరిష్కారమవుతున్నాయి. వివక్షకు తావు లేకుండా పాలనా వ్యవహారాలు సాగుతున్నాయి. దశాబ్దాలపాటు అసౌకర్యాల నడుమ కునారిల్లిన పెద్దకోట్ల గ్రామపంచాయతీకి మంచి రోజులు వచ్చాయి. పంచాయతీ కేంద్రం పెద్దకోట్లలో 393 కుటుంబాలతో1751 మంది జనాభా ఉన్నారు. మజరా గ్రామం గుడ్డంపల్లిలో 117 కుటుంబాలతో 546 మంది జనాభా ఉన్నారు.

అభివృద్ధి పనులు ఇలా...

పెద్దకోట్లలో రూ.45 లక్షల వ్యయంతో సచివాలయ భవనం నిర్మించారు. పెద్దకోట్ల నుంచి గుడ్డంపల్లి వరకు రూ.1.50 కోట్లతో ఒకటిన్నర కిలోమీటరు తారు రోడ్డు వేశారు. దీంతో రాకపోకలకు మార్గం సుగమమైంది.

- గుడ్డంవంక నుంచి బీసన్న కాలనీ మీదుగా దిగువన ఉన్న పెద్దకోట్ల బీసీ కాలనీ వరకు రెండు కిలోమీటర్ల మేర గుంతలు పడిన మట్టిరోడ్డు ఉండేది. వర్షాకాలంలో దారంతా మురదమయంగా ఉండేది. మండల కేంద్రం తాడిమర్రికి వెళ్లాలన్నా, పెద్దకోట్ల నుంచి చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్)లోకి వెళ్లాలంటే ప్రజలు తీవ్ర అవస్థలు పడుతుండేవారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి గత ఎన్నికల సమయంలో సీసీ రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే రూ.20 లక్షలతో సీసీ రోడ్డు వేయించారు. అలాగే గుడ్డంపల్లి, పెద్దకోట్ల గ్రామాల్లో లక్షలాది రూపాయలు ఖర్చుచేసి సీసీ రోడ్లు వేయించారు.
- 'నాడు–నేడు' కార్యక్రమం కింద ప్రాథమికోన్నత పాఠశాలలో రూ.20 లక్షల నిధులతో అదనపు గదులు, బల్లలు, విద్యుత్, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం తదితర పనులు చేపట్టి ఆధునీకరించారు.
- పెద్దకోట్ల, గుడ్డంపల్లి గ్రామాల్లో సుమారు రూ.25 లక్షల నిధులు వెచ్చించి డ్రెయినేజీలు నిర్మించడంతో మురుగు సమస్య పరిష్కారమైంది. పెద్దకోట్ల, మూడు కాలనీలు, గుడ్డంపల్లిలో రూ.20 లక్షల నిధులతో బోర్లు, పైపులైన్ల ఏర్పాటు చేసి తాగునీటి సౌకర్యం కల్పించారు.

ఊరు మారింది

వ్యయప్రయాసలు తగ్గాయి..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ చాలా బాగుంది. సంక్షేమ పథకాలు, పట్టాదారు పాసుపుస్తకాలు, అడంగల్, వన్‌బీ తదితర రైతు సమస్యల కోసం మండల కేంద్రానికి వెళ్లకుండా సచివాలయంలోనే సేవలందుతున్నాయి. ప్రజలకు డబ్బు ఖర్చు, సమయం ఆదా అయ్యాయి.

–నల్లపు భాస్కర్, పెద్దకోట్ల, తాడిమర్రి.

రోడ్డు వేసి సమస్య తీర్చారు



గుడ్డంపల్లి నుంచి పెద్దకోట్ల వరకు మట్టి రోడ్డుతో తీవ్ర అవస్థలు పడేవాళ్లం. గతుకుల రోడ్డుపై ప్రయాణం నరకంగా ఉండేది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే తారు రోడ్డు వేసి సమస్యను తీర్చారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

–పెద్దిరెడ్డి, గుడ్డంపల్లి, తాడిమర్రి

రూ.22వేల రికవరీకి ఆదేశాలు

పుట్టపర్తి అర్బన్: ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల్లో దుర్వినియోగమైన రూ.22వేలు రికవరీ చేయాలని అధికారులు ఆదేశించారు. పుట్టపర్తి మండలంలోని 14 పంచాయతీల్లో 2022–23లో చేపట్టిన ఉపాధి పనులపై చేపట్టిన సామాజిక తనిఖీ ముగియడంతో మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ప్రజా వేదిక నిర్వహించారు. ఎంపీపీ ఎ.వి.రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ప్రిసైడింగ్ ఆఫీసర్ శివశంకర్, విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి, ఏపీడీ రఘునాథరెడ్డి, అంబుడ్స్‌మెన్ శివారెడ్డి, ఏపీఓ మధుసూదన్‌రెడ్డి, ఎస్ఆర్‌పీ కాంతయ్య, ఉపాధి సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ 2022–23లో ఉపాధి హామీ కింద 646 పనులకు రూ.6 కోట్లు, పంచాయతీరాజ్‌లో 11 పనులకు రూ.61 లక్షలు, సమగ్ర శిక్షలో రూ.2.80 లక్షలు ఖర్చు చేసినట్లు వివరించారు. సామాజిక తనిఖీ, గ్రామసభలు నిర్వహించి పనుల్లో చోటుచేసుకున్న తప్పిదాలను గుర్తించామన్నారు. ఇందులో రూ.22వేలు రికవరీ చేయాలని ఆదేశించారు. అనంతరం పీఓ శివశంకర్ మాట్లాడుతూ తనిఖీ బృందం ఆదేశించిన రికవరీ మొత్తాన్ని బాధ్యులు త్వరలోనే చెల్లించాలన్నారు.



ప్రజావేదికలో వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

జగన్‌తోనే జనరంజక పాలన

నల్లమాడ: జనరంజక పాలన కోసం జగన్‌ను మరోసారి సీఎం చేసుకోవాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సతీమణి దుద్దుకుంట అపర్ణారెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం ఆమె దొన్నికోటలో పంచాయతీలోని దొన్నికోట, గూడమేకలపల్లి, డి.చెర్లోపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని కాంక్షించే వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తేవడానికి ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. అపర్ణారెడ్డికి ప్రతి చోటా ప్రజల నుంచి సాదర స్వాగతం లభించింది. ఈ సందర్భంగా దొన్నికోటలో మాజీ ఎంపీటీసీ రమణ నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాగినేని సరస్వతి, పాల ఏకిరి కార్పొరేషన్ డైరెక్టర్ కుళ్లాయమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ యనమల ఉత్తమ్మ, కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ రసూల్, మాజీ సర్పంచ్ ఆదినారాయణ, సింగిల్‌విండో డైరెక్టర్ గోపాల్‌నాయుడు, మార్కెట్ యార్డు డైరెక్టర్ ఆసాది గంగిశెట్టి, నాయకులు నాగరాజు నాయుడు, కమలాకర్ నాయుడు, బాలాజీ నాయుడు, ఎస్.గోపాల్‌నాయుడు, అంజి, ఆసాది ఆదినారాయణ, రామకృష్ణ, పూల శివశంకర్, అశ్వత్థనాయుడు, గెంగినాయుడు, ఆలంసాబ్, ఆదెప్ప, శ్రీనివాసులు, జగదీష్ తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



దొన్నికోటలో ప్రచారం చేస్తున్న దుద్దుకుంట అపర్ణారెడ్డి

376 మందికి వైద్య సేవలు

గాండ్లపెంట: వేపరాల సచివాలయంలో మంగళవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరం నిర్వహించారు. ప్రత్యేక వైద్యులు డాక్టర్ ఆర్షియా పర్వీన్, డాక్టర్ గురులక్ష్మీదేవి, కంటి వైద్య నిపుణులు, స్థానిక వైద్యులు బాబాఫక్రుద్దీన్, మహేశ్వర మారుతి పాల్గొని 376 మందికి వైద్య సేవలందించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామానాయక్, సూపర్‌వైజర్లు ఉపేంద్రారెడ్డి, సరస్వతి, హెచ్ఈ విజయ్‌కుమార్, ఫార్మసిస్ట్ ప్రసాద్, ఏఎన్ఎంలు, ఆరోగ్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షులు లోకేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పేదలకు ఆరోగ్య సు'రక్ష'

ఓడీచెరువు : ఆరోగ్య సురక్ష ద్వారా అందించే సేవలు పేదలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని డాక్టర్ కమల్ రోహిత్ తెలిపారు. కొండకమర్ల సచివాలయం–2 పరిధిలో మంగళవారం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. 350 మందికి వివిధ ఆరోగ్య పరీక్షలు, 32 మందికి కంటి పరీక్షలు చేశారు. డాక్టర్ కమల్ రోహిత్ మాట్లాడుతూ స్వగ్రామంలో నిర్వహించే ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ హరీష్, డాక్టర్ శ్రీవాణి, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మెడికల్ రిపోర్టు అందిస్తున్న అధికారులు

ఔషధ రహిత వైద్య సేవల కేంద్రం ప్రారంభం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కేశవనగర్‌లోనున్న గుద్దిటి సోమదాసు వైట్ హౌస్‌లో మంగళవారం వృద్ధుల ఔషధ రహిత వైద్యసేవల కేంద్రాన్ని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు పోలా ప్రభాకర్ ప్రారంభించారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు రోజూ బీపీ చెకప్, నెబులైజేషన్, నొప్పి నివారణ మందులు విచక్షణారహితంగా వాడటం వల్ల వచ్చే దుష్ఫలితాలు, సొంత వైద్యంతో స్టెరాయిడ్ మందులు సేవించడం వల్ల కలిగే అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పిస్తామన్నారు. వృద్ధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో చెన్నకేశవ స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ దాశెట్టి సుబ్రహ్మణ్యం, యువర్స్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం

ఎన్‌పీకుంట: ధనియానిచెరువు పంచాయతీ డి.కొత్తపల్లిలో బుధవారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ కొత్త రంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్‌అహ్మద్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధశాఖల కన్వీనర్లు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

సృజనాత్మకత వెలికితీసేందుకే పోటీలు



విజేతలతో ఆర్డీటీ ఆర్డీ ప్రమీల

బత్తలపల్లి: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ (ఆర్డీ) ప్రమీల పేర్కొన్నారు. మంగళవారం బత్తలపల్లి ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో రీజనల్ స్థాయి క్విజ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఐదు ఏరియాల నుంచి 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ స్థానం కొత్తచెరువు, ద్వితీయ స్థానం ముదిగుబ్బ, తృతీయ స్థానం బత్తలపల్లి విద్యార్థులు సాధించారు. వీరు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజేతలకు ముఖ్య అతిథి ఆర్డీ బహుమతులు ప్రదానం చేశారు. క్విజ్ మాస్టర్లుగా సీనియర్ టీటీఎం నాగభూషణ, వెంకటేషులు వ్యవహరించారు. కార్యక్రమంలో బత్తలపల్లి ఏటీఎల్ రుక్మాంగద తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో మినహాయింపునకు వినతి

పుట్టపర్తి అర్బన్: ఎన్నికల విధుల్లో పలువురు ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు డీఆర్‌ఓ కొండయ్యను కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన డీఆర్‌ఓను చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న, ప్రమాదాలకు గురై మెడికల్ లీవులో ఉన్న, ఒంటరి మహిళ, చంటిబిడ్డ తల్లులు, రిటైర్మెంట్‌కు దగ్గర పడిన, బధిర, వైకల్యంతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఎన్నికల విధులు ముగిసిన తర్వాత సుదూర ప్రాంతాలకు వెళ్లే సిబ్బందికి బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు సంపత్‌కుమార్, వెంగమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సజావుగా టెట్



పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న డీఈఓ మీనాక్షి

పుట్టపర్తి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) మంగళవారం జిల్లాలో సజావుగా సాగింది. పుట్టపర్తి సమీపంలోని సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న పరీక్షలను డీఈఓ మీనాక్షి పరిశీలించారు. ఈ కేంద్రంలో ఉదయం, మధ్యాహ్నం పరీక్షకు మొత్తం 200 మందికి గాను 170 అభ్యర్థులు హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు.

వైద్య ఉద్యోగుల సమస్యలపై 'గ్రీవెన్స్ డే'

ప్రశాంతి నిలయం: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో వైద్య ఉద్యోగుల సమస్యలపై మంగళవారం 'గ్రీవెన్స్ డే' నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సెల్వియా థామస్ ఆధ్వర్యంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు ఫిర్యాదులు స్వీకరించారు. స్టాఫ్ నర్సుల సమస్యలపై ఎక్కువగా వినతులు అందాయి. కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ సి.ఉదయ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కుటాగుళ్లలో శ్రమదానం

కదిరి అర్బన్: పట్టణంలోని ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ –2 ఆధ్వర్యంలో మంగళవారం కుటాగుళ్లలో శ్రమదానం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు వీధుల్లో చెత్తను తొలగించడంతో పాటు రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత, ఎన్ఎస్ఎస్ యూనిట్– 2 ఆఫీసర్ హనుమంతరావ్, యూనిట్– 1 ఆఫీసర్ కృష్ణానాయక్‌తో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడి ఎంపికపై హర్షం



పరమేశ్వర్‌రెడ్డి నంగి (ఫైల్)

ధర్మవరం అర్బన్: అమెరికాలోని ఆస్టిన్ నగర తెలుగు కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పరమేశ్వర్‌రెడ్డి నంగి ఎంపిక కావడంపై ఆత్మీయ ట్రస్ట్ చైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ సూర్యప్రకాష్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం పట్టణంలోని ఆత్మీయ ట్రస్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. తలుపుల మండలం నంగివాండ్లపల్లికి చెందిన పరమేశ్వర్‌రెడ్డి అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎంపికై తెలుగువారి ఖ్యాతిని పెంచారని కొనియాడారు. భవిష్యత్తులో మరెన్నో పదవులు పొందాలని వారు ఆకాంక్షించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పెనుకొండ రూరల్: కర్ణాటక మద్యం విక్రేతను సెబ్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. మునిమడుగుకు చెందిన రత్నమ్మ అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో వెళ్లి అరెస్టు చేసినట్లు సెబ్ సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం

పుట్టపర్తి టౌన్: యువతీ యువకులకు ఉపాధి కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రిన్సిపాల్ మక్బూల్ హుస్సేన్ పేర్కొన్నారు. మంగళవారం బుక్కపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మినీ జాబ్ మేళా నిర్వహించారు. 35 మంది అభ్యర్థులు హాజరవగా రెండు కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూ చేశారు. వీరిలో 15 మందిని తదుపరి రౌండ్ ఇంటర్వ్యూలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



అభ్యర్థులతో మాట్లాడుతున్న కంపెనీ ప్రతినిధులు

అప్పుడే ఎండలు.. అదిగో పండ్లు, రసాలు



పుట్టపర్తి గోకులంలో పుచ్చకాయల అంగడి



గణేష్ సర్కిల్‌లో చెరకు రసం విక్రయం

పుట్టపర్తి అర్బన్: వేసవికి ముందే ఎండలు మండిపోతున్నాయి. 40 డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం పది గంటల నుంచే సూరీడు ప్రతాపం చూపుతున్నాడు. వివిధ పనుల కోసం ఇంటి నుంచి బయటకు వచ్చేవారు ఎండలకు విలవిలలాడుతున్నారు. శరీరంలో నీటి శాతం తగ్గకుండా ఉండేందుకు పండ్లు, రసాలను స్వీకరిస్తున్నారు. జిల్లా కేంద్రం పుట్టపర్తిలో కొబ్బరి బోండాలు, చెరుకు రసం, కళింగర (పుచ్చకాయ), ద్రాక్ష, అనాసపండ్లు, దానిమ్మ, బొప్పాయి, చీనీ, దోస వ్యాపారాలు ఊపందుకున్నాయి. కృత్రిమంగా తయారయ్యే పానీయాల పట్ల ప్రజలు ఆసక్తి చూపడం లేదు. సరసమైన ధరకే ఆరోగ్యం పెంపొందించే పండ్లు, రసాల కోసం మొగ్గు చూపుతున్నారు. మార్కెట్లు, రైతుల వద్దకు వెళ్లి పండ్లు కొనుగోలు చేస్తున్నారు.

సరసమైన ధరలు..

కొబ్బరి బోండం రూ.25 నుంచి రూ.40కు లభిస్తోంది. చెరుకు రసం గ్లాసు రూ.20, పుచ్చకాయ సైజును బట్టి రూ.50 నుంచి రూ.150 వరకు విక్రయిస్తున్నారు. కర్బూజ ముక్కలు ప్లేటు రూ.20కు లభిస్తోంది. ఇటీవల ద్రాక్ష అమ్మకాలు బాగా పెరిగాయి. పక్కనున్న బాగేపల్లి, బెంగళూరు, అనంతపురం నుంచి తీసుకొచ్చి కిలో రూ.60కే విక్రయిస్తున్నారు. ఇక దానిమ్మ రూ.120, కమలా పండ్లు రూ.40, యాపిల్ రకాలను బట్టి రూ.150 వరకు దొరుకుతున్నాయి.



ప్రశాంతి నిలయంలో కొబ్బరి బోండాల అమ్మకాలు



ఆటోలో వివిధ రకాల పండ్లు అమ్ముతున్న వ్యాపారి